
చిత్తడిగా మారి.. రాకపోకలకు బేజారే



కంది మండలం కాశీపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. బడి పక్కనే రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. చిన్నారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆటలకు దూరమవుతున్నారు. ఆవరణ చదును చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కంది.

పచ్చందం మాటున ప్రమాదం



చిత్రం చూస్తే ఆహ్లాదంగా కనిపిస్తుంది కదూ.. అలా దాని దగ్గరికి వెళితే ప్రమాదకరమే. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. సదాశివపేట మండలం కంబాలపల్లి శివారులో తీగలు విద్యుత్తు స్తంభానికి ఇలా పూర్తిగా అల్లుకున్నా పట్టించుకోవడంలేదు. వర్షాకాలం కావడంతో ప్రమాదకరమని తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.
– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సదాశివపేట.

18న వెయిట్ లిఫ్టింగ్ ఉమ్మడి జిల్లా ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా బాల బాలికల అండర్‌-17 వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు ఈ నెల 18న తేదీన శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 1-1-2008 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.

లాభపడింది ఒకరు.. బాధపడుతోంది ఎందరో

నీటివనరులు కబ్జా చేసి భూముల అమ్మకాలు



జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం జోరందుకోవడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా అక్రమార్కుల కన్ను నీటి వనరులపై పడింది. వాటిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. సొంత గూడు కోసం కలలు కంటున్న వారు వెంటనే నిర్మాణాలు చేపట్టి, అక్కడికి చేరిపోతున్నారు. వర్షం వచ్చిన సమయంలో వరద చేరి అవస్థలు పడుతున్నారు. తెలియక కొనుగోలు చేసి ఊబిలో కూరుకుపోయామని, ఈ దందాను అధికారులు ముందే అడ్డుకుంటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్.

జిల్లాలో ఆక్రమణలు గుర్తించారిలా..

అమీన్‌పూర్	889
రామచంద్రాపురం	80
సంగారెడ్డి	9
జిన్నారం	9
గుమ్మడిదల	3
కంది	1

కుంటలు కనుమరుగు

జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని బొబ్బిలికుంట, ఎర్రకుంట, దూద్‌బాయి, మహబూబ్‌సాగర్, తుర్కవాని, కుక్కల కుంటలు, చంద్రయ్య చెరువు, మాసానికుంటను కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మడంతో ఇళ్లను నిర్మించారు. కట్టలు, తూములు, అలుగులు నామరూపాలు లేకుండా పోయాయి. వీటిని పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వానల సమయంలో ఆయా ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.



ఎర్రకుంటలో నివాసాల్లోకి వరద

సాగు భూములు లేక



కమ్మరి కుంటలో నిర్మాణాలు

సదాశివపేట పట్టణంలో చెరువు కుంటల ఆక్రమణ వల్ల కనుమరుగు అయిపోతున్నాయి. చెరువులు, కుంటల కింద ఉన్న భూములు విక్రయించడంతో నివాస ప్రాంతాలయ్యాయి. సాగు భూములు లేకపోవడం వల్ల నీటివనరులు నిరుపయోగంగా మారాయి. ఇదే అదునుగా భావించిన కొందరు వాటిల్లోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు ఇంటినంబర్లు కేటాయించడంతో, విద్యుత్తు అధికారులు కరెంట్ కనెక్షన్లు ఇచ్చారు. కమ్మరికుంట, గులామ్‌మేని కుంటల్లో 150 మంది నివాసం ఉంటున్నారు. అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం

జిల్లాలో శిఖం భూముల్లో ఇళ్లు కట్టిన వారిని గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో వరద రాకుండా దిగువకు సాఫీగా వెళ్లేలా మరమ్మతు చేయిస్తున్నాం. భవిష్యత్‌లో వారికి ఇబ్బందులు లేకుండా చూస్తాం – వినయ్య, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ, సంగారెడ్డి జిల్లా.

అన్నదాతల కలవరం..



అన్యాక్రాంతంలో సదానందం కుంట

అందోలు సదానందం కుంట 10ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. కుంటకు ఆనుకుని ఉన్న భూయజమానులంతా కుంటకు చెందిన భూములను కలిపేసుకున్నారు. మిషన్ కాకతీయ పథకంలో పూడిక తీయించారు. సుమారు 30 ఎకరాలకు సాగు నీరు అందేదని రైతులు పేర్కొంటున్నారు. కొన్నేళ్లుగా అక్రమార్కుల చర్యల వల్ల కుంటనామరుపాలు లేకుండా పోయిందని, పంటల సాగుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

కొలువులో చేరిన కొత్త ఉపాధ్యాయులు



ఖేడ్ ఎమ్మార్సీలో రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయులు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, సంగారెడ్డి మున్సిపాలిటీ: పాఠశాలలు కొత్త ఉపాధ్యాయులతో కళ సంతరించుకున్నాయి. డీఎస్సీలో ఎంపికైన 397 మంది బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. మొదట మండల విద్యాధికారి కార్యాలయంలో రిపోర్టు చేశాక, పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులకు జాయినింగ్ రిపోర్టును అందించారు. కొత్త ఉపాధ్యాయులు ఎక్కువగా కంగ్టి, మనూరు, సిర్గాపూర్, నాగల్‌గిద్ద, రాయికోడ్, ఝరాసంగం, మునిపల్లి, వట్‌పల్లి, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో చేరారు. తొలి రోజు ఉపాధ్యాయులుగా వచ్చిన వారు ఉత్సాహంగా పాఠాలు చెప్పారు. కొన్ని చోట్ల వీరిని పూలమాలలతో సన్మానించారు. తొలి రోజు పాఠాలు చెప్పడం తమకు ఎంతో అనుభూతి ఇచ్చిందని వారు పేర్కొన్నారు. లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి రోజు విద్యార్థులకు పాఠాలు చెబుతామని పేర్కొన్నారు.

ఖేడ్ నియోజకవర్గానికి 187 మంది: ఖేడ్ నియోజకవర్గానికి ప్రభుత్వం 187 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించింది. మండలాలవారీగా ఖేడ్ 5, మనూరు 15, నాగల్‌గిద్ద 33, సిర్గాపూర్ 25, కల్హేర్ 10, నిజాంపేట 10, కంగ్టి 61, మెదక్ జిల్లా పరిధిలోకి వచ్చే పెద్దశంకరంపేట మండలానికి 27 మందిని కేటాయించారు. కేటాయించిన వారిలో బుధవారం 99 శాతం మంది విధుల్లో చేరారు.

గ్రంథాలయంపై చిన్నారులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి ఫసల్‌వాది ప్రాథమిక పాఠశాలను రూమ్ టూ రీడ్ సంస్థ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. సంస్థ జాతీయ ప్రతినిధి రిషి విద్యార్థులతో మాట్లాడి గ్రంథాలయాన్ని ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకున్నారు. గ్రంథాలయంతో ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కృత్యాలు, చిత్రలేఖనం వంటివి చేయించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వహీద్, సంస్థ ప్రతినిధులు నరసింహచారి, యశస్విని, ప్రభు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

దిగ్వాల్(కోహీర్), న్యూస్‌టుడే: గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కోహీర్ మండలం పరిధిలోని దిగ్వాల్ సాంఘిక సంక్షేమ(బాలుర) వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంతోపాటు ఏరోజు ఏమి వండారో ప్రదర్శనలో ఉంచాలని పేర్కొన్నారు. ప్రైవేటు భవనంలో వసతిగృహం కొనసాగుతున్నందున వంట గదిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాములు, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ఎర్రరాయి గనుల్లో తనిఖీలు



మిర్జంపల్లితండాలో జప్తు చేసిన డోజర్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ డివిజన్‌లోని ఎర్రరాయి గనుల్లో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాల రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం 'ఈనాడు'లో 'సహజ సంపదకు ఆపద' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్డీవో రాజు గనుల్లో తనిఖీలు చేపట్టాలని ఆయా మండలాల తహసీల్దార్‌ను ఆదేశించారు. మిర్జంపల్లితండాలో శివారులోని గనుల్లో తహసీల్దార్ హసీనాబేగం తనిఖీలు చేసి డోజర్ వాహనాన్ని జప్తు చేసి జరిమానా విధించారు. జహీరాబాద్ మండలం ఆనెగుంట, శేఖాపూర్ సహా న్యాల్‌కల్ మండలంలోని గణేష్‌పూర్ గనుల్లో రెవెన్యూ తనిఖీలకు వెళ్లడంతో అక్రమార్కులు పరారయ్యారు.

రాయితీ రుణాల సద్వినియోగంతోనే ఆర్థికాభివృద్ధి



నాటు కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో డీపీఎంలు రవీందర్, శ్రీనివాస్

వట్‌పల్లి, న్యూస్‌టుడే: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీ రుణాలతో నిర్దేశించుకున్న యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందడం వల్ల పేదరికం తగ్గుతుందని డీఆర్డీవో డీపీఎంలు రవీందర్, శ్రీనివాస్ పేర్కొన్నారు. వట్‌పల్లిలో బ్యాంకులు, స్త్రీనిధి, సీఐఎఫ్ ద్వారా రాయితీ రుణాలతో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న పలు యూనిట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి పథకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం చంద్రశేఖర్, ఈశ్వరయ్య, మల్లేశ్వరి, సీవో మమత పాల్గొన్నారు.

పరిశ్రమలు సహకరిస్తే మరింత పురోగతి

మంత్రి దామోదర్ రాజనర్సింహ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి దామోదర్, చిత్రంలో ఎంపీ సురేష్ షెట్కార్, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జోగిపేట, పుల్కల్, నారాయణఖేడ్, సిర్గాపూర్, న్యూస్‌టుడే: జిల్లాలో అభివృద్ధికి పరిశ్రమల ప్రతినిధుల సహకారం అందించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు. బుధవారం సంగారెడ్డి సీఎస్ఐ చర్చి వద్ద 'సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ గ్లాండ్ ఫార్మా' ఆధ్వర్యంలో జిల్లాకు పది ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ ద్విచక్ర వాహనాలను ఉచితంగా అందజేశారు. వాటిని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సంగారెడ్డి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, జహీరాబాద్, ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు పరిశ్రమల ప్రతినిధులు చేయూత నివ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన జోగిపేట, పుల్కల్, సిర్గాపూర్ మండలాల్లో పర్యటించారు. చౌటకూరు మండలం శివ్వంపేటలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించి, సన్నాలు వేసే రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల మెట్రిక్ టన్నుల సన్నాలు కేంద్రాలకు వస్తాయన్న ఆశాభావంతో ఉన్నామన్నారు. 211 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పేద పిల్లలు పోటీ ప్రపంచంలో గెలవాలి: పుల్కల్ మండల పరిధి బస్వాపూర్ శివారులో రూ.125 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల సముదాయం' భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులతో ముచ్చటించారు. పుల్కల్ ఉన్నత పాఠశాలలో ఆగిన భవన నిర్మాణ పనులు, బస్వాపూర్ ఆదర్శ పాఠశాల హాస్టల్ ప్రారంభం, జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ఇబ్బందులను మంత్రికి విన్నవించారు. పనులను వెంటనే పూర్తి చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. పేద పిల్లలు పోటీ పడి గెలవాలనే తపనతోనే నియోజకవర్గంలో పలు విద్యాసంస్థలను తెచ్చామని చెప్పారు. పిల్లలకు చదువు, పెద్దలకు చక్కని ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతేనన్నారు. సింగూరు ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. సిర్గాపూర్ మండలం వాసర్ సమీపంలోని సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి వాలుతండా రైతులు 25 ఎకరాలు త్యాగం చేశారని, ఇదే ప్రాంతంలో సర్వే చేయించి 25 ఎకరాలు రైతులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కౌముది వ్రతమహోత్సవం

సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో గర్భన్యాస కౌముది వ్రతమహోత్సవ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీమహేశ్వరశర్మ సిద్ధాంతి కార్యక్రమ విశిష్టతను భక్తులకు వివరించారు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ.



అకాల వర్షం...తడిసిన ధాన్యం

సంగారెడ్డి అర్బన్, జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సంగారెడ్డి, జోగిపేట, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. వర్షాలతో చేతికి వచ్చిన వరి, పత్తి, పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జోగిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని ఒపెన్ ప్లాట్ ఫాంపై రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం అకాలంగా కురిసిన వర్షానికి తడిసింది. బుధవారం ఉదయం ఏడుగంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్ద అయ్యింది. కొంత ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. అప్రమత్తమైన రైతులు వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పారు. గత మూడురోజులు నుంచి రైతులు ఇక్కడ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి: భాజపా



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సదాశివపేట పట్టణంలో హనుమాన్, వినాయకుడి విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భాజపా, హిందు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి, సదాశివపేటల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సంగారెడ్డిలో ఎస్పీ రూపేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, సదాశివపేట కౌన్సిలర్లు మాణిక్‌రావు, మల్లేశం, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు రవి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు పవన్ గౌడ్ పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ప్రత్యేక పీపీగా సూర్‌రెడ్డి



సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని పోక్సో కోర్టు ప్రత్యేక పీపీగా వట్‌పల్లి మండలం ఉసిరికపల్లికి చెందిన సూర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 2006 నుంచి సంగారెడ్డి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు.

భూ బ్యాంకులో భద్రం

- హెచ్‌ఎండీఏ వద్ద 5,364కు పైగా ఎకరాలు
- కంచె, జీపీఎస్‌తో రక్షణకు కసరత్తు



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) మహా భూ బ్యాంకు సిద్ధం చేసింది. ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు పలు సంస్థలకు కేటాయింపులు, లేఅవుట్లకు పోను ఇంకా 5,364 ఎకరాల వరకు ఉంది.

ఇటీవల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతుండటంతో అసలు లెక్కలు బయటకు తీసింది. ఏడు జిల్లాల పరిధిలో ఎంత భూమి ఉందో సరిచూసింది. దీంతో రూ. వేల కోట్ల విలువైన భూములు హెచ్‌ఎండీఏ ఖాతాలో ఉన్నట్లు తేలింది. ఈ బ్యాంకులోని భూములను కాపాడుకునేందుకు హెచ్‌ఎండీ కసరత్తు చేయడంతోపాటు భవిష్యత్తులో వీటిని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భూములు అధిక ధర పలుకుతుండటంతో ఇక్కడ ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

సంగారెడ్డిలో భూములు ఇక్కడే (ఎకరాల్లో..)

మండలం	ప్రాంతం	భూమి
రామచంద్రాపురం	తెల్లాపూర్	43
రామచంద్రాపురం	ఈసీఐఎల్, దమ్మాయిగూడ	119
జిన్నారం	ఐడీఏ బొల్లారం	43
జిన్నారం	జిన్నారం	100
పటాన్‌చెరు	లక్డారం	184
పటాన్‌చెరు	చిట్కుల్	49
జిన్నారం	జిన్నారం	70
సంగారెడ్డి	ఫసల్‌వాడి	52
కంది	ఆరుట్ల	106
కంది	ఇంద్రకరణ్	140
కంది	కంది	50
మునిపల్లి	బుధేరా	86
పటాన్‌చెరు	పెద్దకంజర్ల	213

జీపీఎస్‌తో అనుసంధానం..

- శేరిలింగంపల్లిలోని మియాపూర్‌లోని సర్వే నెంబరు 100, 101లో హెచ్‌ఎండీఏకు 445.340 ఎకరాలు ఉండగా. . ఇటీవల ఇందులో పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు నేతలు ప్రోద్బలంతో గుడిసెలు వేయగా. ..అధికారులు అతికష్టం మీద అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ హెచ్‌ఎండీఏ కంచె నిర్మిస్తోంది. జీపీఎస్‌తోనూ అనుసంధానం చేయనున్నారు. భవిష్యత్తులో ఎవరైనా సర్వే రాళ్లు తొలగించి హెచ్‌ఎండీఏ భూమిలోకి చొచ్చుకొచ్చినా జీపీఎస్ కోఆర్డినేట్స్ చూసి తొలగించే అవకాశం ఉంది.
- కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని వివిధ సర్వే నెంబర్లలో 2370 ఎకరాలు ఉండగా... ఇందులో ఇప్పటికే వివిధ అవసరాల కోసం 795 ఎకరాలు కేటాయించారు. ఇంకా 1574.300 ఎకరాలు హెచ్‌ఎండీఏ ఖాతాలో ఉంది. ఈ భూమికి సరైన రక్షణ లేక ఆక్రమణల పాలవుతోంది. దాదాపు ఆరేడు వందల ఎకరాల్లో కోర్టు కేసులు నడుస్తున్నాయి. చాలాచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.
- భవిష్యత్తు అవసరాలకు... మహానగరం విస్తరిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ దాటి అవుటర్ రింగ్ రోడ్డు వరకు నిర్మాణాలు వెలుస్తున్నాయి. రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత మహానగర పరిధి దాదాపు 8 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం పెరగనుంది. అప్పటి అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులకు భూమి చాలా కీలకం. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడక తప్పదు. దీంతో హెచ్‌ఎండీఏ భూ బ్యాంకు కాపాడుకుంటే భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. అయితే భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడం హెచ్‌ఎండీఏకు పెద్ద సవాలుగా మారుతోంది. తొలుత చిన్న చిన్న గుడిసెలు వేసి. ..వాటికి దొంగ సర్వే నెంబర్లు సృష్టిస్తున్నారు. నెమ్మదిగా పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిని కూల్చడానికి వెళితే కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారు. ఈ భూముల రక్షణ కోసం హెచ్‌ఎండీఏ పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మధ్యాహ్న భోజనం.. మరింత రుచిగా..



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం మరింత రుచిగా ఉండేలా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఇప్పటి వరకు ఒక్కో ఎంఈవో మూడు, నాలుగు మండలాలు చూడడంతో ఈ పథకంపై దృష్టి సారించలేకపోయారు. ఇటీవల వీరిని నియమించడంతో భోజనాన్ని తనిఖీ చేయాలని, అవసరమైతే విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎంత మంది భోజనం చేస్తున్నారో గూగుల్ మ్యాప్‌తో తేదీ, సమయం వచ్చేలా చిత్రాలను పంపాలని సూచించారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం: జిల్లాలో 1,247 పాఠశాలల్లో 1.17 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

16 మండలాల్లో అక్షయపాత్ర ద్వారా భోజనాన్ని అందిస్తున్నారు. మిగిలిన మండలాల్లో 12 మండలాల్లో ఏజెన్సీల ద్వారా విద్యార్థులకు వండి వడ్డిస్తున్నారు. వారంలో మూడు రోజులు గుడ్డు అందించాలి. మరో మూడు రోజులు రాగిజావ పిల్లలకు పంపిణీ చేయాలి. విద్యాశాఖ ఇచ్చిన మెనూ ప్రకారం వడ్డించాలి. చాలా చోట్ల నాణ్యత లేకుండా వండుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎంఈవోలు అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా లోపాలుంటే నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలి. నాణ్యత లేకుంటే సూచనలు చేయాలి. రెండోసారి కూడా నాణ్యత లేకుంటే నోటీసులు జారీ చేస్తారు. నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రక్రియ సాగేలా చూడాలి.

మొక్కలు పెంచేలా..: పాఠశాల వద్దే కూరగాయల పంటలు పండించేలా ప్రోత్సహించాలి. పాఠశాల ఆవరణలో స్థలాన్ని గుర్తించి తోట సాగు చేసేలా చర్యల తీసుకోవాలి. విత్తనాలను పాఠశాలకు అందించి నాటించాలి. భోజనానికి అవసరమైన కూరగాయలు మొక్కలు పెంచేలా చూడాలి.

తనిఖీ చేయాలని ఆదేశించాం:

పాఠశాలల్లో మండల విద్యాధికారుల మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలి. నాణ్యతగా వండుతున్నారా? లేదా పరిశీలించి నివేదికలు సమర్పించాలి. ఎక్కడైనా నాణ్యత లేకుంటే వెంటనే సమాచారం ఇవ్వాలి. వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. – వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

పిల్లలకు ఆర్థిక సాయం

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలకు మెడ్వాన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 లక్షల సహాయాన్ని బుధవారం సంఘ భవనంలో అందించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విజయ చిత్ర ఫౌండేషన్, బ్రదర్ ఆఫ్ గార్బల్ ప్రివిజన్ సంస్థల సహకారంతో సాయం అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశం, ముజీబ్, స్వప్న పాల్గొన్నారు.

సోయాబీన్స్ తగ్గుముఖం


విపణిలో సోయాబీన్స్ ధాన్యం

న్యూస్‌టుడే, జహీరాబాద్: వర్షాధారంగా సాగు చేసే వాణిజ్య పంటల్లో ప్రధానమైంది సోయాబీన్స్. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సాగు చేసేవారు. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, విపణిలో గిట్టుబాటు ధర లభించక పోవడంతో సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోంది. దానికి బదులుగా పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. దాదాపు రెండు నెలలుగా తరచుగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడు వేసిన కొద్దిపాటి పంట సైతం దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిల్లాలోని విపణులు వెలవెల బోతున్నాయి. సాధారణానికి భిన్నంగా గత రెండు, మూడేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది.

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2022	40514	76442
2023	20500	41756
2024	15000	35000

మహారాష్ట్రలో మిల్లులు ఎక్కువ

సోయాబీన్ ధాన్యాన్ని నూనె మిల్లుల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. నూనె తీయడంతో పాటు పిండిని కోళ్ల దాణాకు ఉపయోగిస్తుంటారు. మిల్లుల ఏర్పాటుకు మహారాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వరకు రాయితీ ఇవ్వడంతో అక్కడ ఎక్కువగా ఉన్నాయి. మన రాష్ట్రంలో జహీరాబాద్, రామాయంపేట, కరీంనగర్‌లో ఒక్కొక్కటి చొప్పున, హైదరాబాద్‌లో రెండు ఉన్నాయి. జహీరాబాద్‌కు కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే మహారాష్ట్రలో మిల్లులు ఉండటంతో అటు ఎక్కువగా సోయాబీన్స్ తరలిస్తారు.



రాయితీలు ప్రకటించాలి: అతివృష్టి, అనావృష్టిలతో నాలుగేళ్లుగా సోయాబీన్స్ పంట దిగుబడులు పడిపోతున్నాయి. నష్టాలతో సాగు చేయలేక ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఆదుకోవాలి. ఈ సంవత్సరం దాదాపు రెండు నెలలుగా ప్రతిరోజు వాన కురుస్తోంది. కనీసం పెట్టుబడులైనా రావడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించాలి.
– గోవింద్‌రెడ్డి, బూచినెల్లి


రూ.144 కోట్ల మద్యం తాగేశారు


- గతేడాది కంటే విక్రయాలు తక్కువ
- సంగారెడ్డి జిల్లాలో మాత్రమే ఎక్కువ





మెదక్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సాధారణంగా పండగ వచ్చిందంటే ముక్క, చుక్క ఉండాల్సిందే. దసరా లాంటి పెద్ద పండగ వస్తే మద్యం తప్పనిసరి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో గతేడాది దసరా పండగ సీజన్‌ను ఈసారితో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో మాత్రమే మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. మిగతా మూడు జిల్లాల్లో తక్కువ అమ్ముడయ్యాయి. మెదక్ జిల్లాలో కేవలం రెండు రోజుల లోనే రూ.13.43 కోట్ల విలువైన మద్యాన్ని డిపో నుంచి వ్యాపారులు తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలో 48 వైన్స్‌లు, 3 బార్లు ఉన్నాయి. రూ.59.48 కోట్ల లక్ష్యం పెట్టుకోగా సగమైనా దాటలేదు.

- వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. మద్యం గొలుసు దుకాణాలు, ధాబాల్లో విచ్చలవిడిగా అమ్మారు.
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు, శనివారం నాడు పండగ రావడంతో సిద్దిపేట జిల్లాలో అమ్మకాలు తగ్గాయని భావిస్తున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల జోరుతో పెరిగాయి. గతంతో పోల్చితే రూ.4.62 కోట్ల మేర ఆదాయం తగ్గింది.
- సంగారెడ్డి జిల్లాలో నిరుడు దసరా కంటే ఈసారి ఐఎంఎల్ లిక్కర్, బీర్ల ద్వారా జిల్లాకు రూ.2.17 కోట్ల ఆదాయం ఎక్కువ సమకూరింది. 3.66 శాతం వృద్ధి నమోదైంది. ఈ జిల్లాలో 5 ఆబ్కారీ స్టేషన్‌లు, 101 దుకాణాలు, 34 బార్ రెస్టారెంట్లు ఉన్నాయి.









ఫోన్‌లో ఓటు చూసుకోండి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: త్వరలోనే స్థానిక సంస్థ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో పేరు ఉందీ లేనిదీ సెల్‌ఫోన్‌లో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది. tsec.gov.in అని వెబ్‌సైట్‌లో ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. ఫైనల్ రోల్స్ ఐచ్ఛికం కనిపిస్తుంది. జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయగానే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. వార్డుల వారీగా అందులో పేరు చూసుకోవచ్చు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



వివరాలు చూపించే పేజీ



ఉదయ భానుడు

చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రం కాదిది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట గ్రామ శివారులో తెల్లవారుజామున ఉదయిస్తున్న సూర్యుడు. గ్రామ శివారులోని కొండల మధ్య నుంచి జ్వాలను తలపించే వెలుగుతో పైపైకి భానుడు వస్తున్నాడు.
– న్యూస్‌టుడే, చిలప్‌చెడ్

పథకాలతో పేదరికం దూరం



మెదక్ టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో పేదరికం పెరిగితే అశాంతి, అసమానతలతో ప్రజల మధ్య వైరుధ్యాలు చోటుచేసుకుంటాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త చట్టాల ద్వారా, పథకాలతో, బడ్జెట్ కేటాయింపులతో పేదరికాన్ని నిర్మూలించేందుకు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు రచిస్తాయి. కరోనా వ్యాప్తి చెందిన సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇల్లు, పారిశుద్ధ్యం, బడి కెళ్లడం, పౌష్టికాహారం తదితరాంశాలను గణించి పేదరికం సూచికలను తయారుచేస్తున్నారు. 2023లో నీతి ఆయోగ్ ప్రకటించిన సూచికల మేరకు వికారాబాద్ జిల్లాల్లో పేదరికం.. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌లతో పోల్చితే ఎక్కువగా ఉంది. తెలంగాణ జిల్లాల్లోని పేదరికం ప్రకారం వికారాబాద్ 29వ స్థానంతో అధమంలో ఉంది. మొదటి పది ఉత్తమ స్థానాల్లో మిగతా మూడు జిల్లాలున్నాయి. నేడు 'పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా కథనం.

అట్టడుగు జీవితం నుంచి యజమాని వరకు..

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కొద్దిపాటి పొలంలో వ్యవసాయంతో కుటుంబ ఖర్చులు గడిచేవి కావు. పండగలైనా ఒక్కోసారి సరైన ఆహారమే దొరికేది కాదు. అలాంటి స్థితిలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లింగాయిగారి కొండల్‌రెడ్డి.. వాహనాల మెకానిజం నేర్చుకున్నారు. ఓవైపు చదువుకుంటూనే తండ్రికి పొలంలో చేదోడువాదోడుగా ఉంటూనే ద్విచక్ర వాహనాలపై మోజుతో వీలైన సమయంలో మెకానిజం నేర్చుకున్నారు. రెండు సంవత్సరాల్లో కష్టపడి సొంతంగా మరమ్మతులు చేయడంలో అనుభవం పొందారు. దోమడుగులో మెకానిక్ దుకాణం ప్రారంభించారు. వాటి సంపాదనతో అభివృద్ధి చెంది.. అక్కడే ప్రస్తుతం ఓ ద్విచక్రవాహనాల షోరూంకు యజమానిగా మారారు. సోదరుడు వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఒకనాడు పేదరికంలో మగ్గిన తాము కష్టపడి మరమ్మతులు నేర్చుకొని నేడు తమ కుటుంబ సభ్యులను సంతోష పెట్టగలుగుతున్నామని పేర్కొన్నారు. మరో పది మందికి ఉపాధి కల్పిస్తుండటం సంతృప్తిగా ఉందని తెలిపారు.


కొండల్‌రెడ్డి

ఉపాధికి కొన్ని పథకాలు

పీఎం స్వనిధి: కరోనా సమయం ప్రతి ఒక్క వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వీధి వ్యాపారాలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. వీధి వ్యాపారులను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. పూచికత్తు లేకుండా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాన్ని ఇస్తారు. వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చు.

కార్పొరేషన్ రుణాలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వం వాహనాలు, వ్యాపారాలకు ఇస్తున్నారు. రాయితీలు ఉన్నాయి.

బ్యాంకు లింకేజీ: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అతి ప్రధానమైన పథకాల్లో బ్యాంకు లింకేజీ ఒకటి. ఇది గ్రామాల, పట్టణాల మహిళలను స్వయం సహాయక సంఘాల పేరుతో గ్రూప్‌లుగా చేసి వారికి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తుంది. సులభంగా తిరిగి చెల్లించవచ్చు. వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు.

శ్రీనిధి: స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి పేరుతో పథకం తెచ్చింది. పాడి పశువులకు, మేకలు, కిరాణం, పౌల్ట్రీలకు రుణాలు ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చు.

రాజస్థాన్ సదస్సుకు పొట్లపల్లి విద్యార్థి ఎంపిక


కల్లెపల్లి ప్రశాంత్

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: రాజస్థాన్‌లోని మహారాజా గంగాసింగ్ విశ్వవిద్యాలయంలో జరిగే 61వ ఆలిండియా రాజనీతి శాస్త్రం అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన పరిశోధక విద్యార్థి కల్లెపల్లి ప్రశాంత్‌కు దక్కింది. ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాభ్యాసాన్ని హుస్నాబాద్, వరంగల్‌లో పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో 'తెలంగాణలో షెడ్యూలు తెగల రిజర్వేషన్ల ప్రభావం' అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ నెల 18, 19 తేదీలలో రాజస్థాన్ సెమినార్‌లో పాల్గొంటారు. అందులో 'భారతదేశంలో మారుతున్న ప్రజాస్వామ్యం, రాజకీయ అవకాశాల పరిమితులు' అంశంపై ప్రసంగిస్తారు. 'వికసిత్ భారత్ 2047'లో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ప్రశాంత్‌ను గ్రామస్థులు, అధ్యాపకులు అభినందించారు.

బసవేశ్వర ఉత్సవం.. తరలుతున్న భక్తజనం


బసవకల్యాణ్‌లో 108 అడుగుల విగ్రహం

న్యూస్‌టుడే, జహీరాబాద్: మానవతావాది, లింగాయత్, బసవ ధర్మీయుల ఆరాధ్య దైవం బసవేశ్వరుడికి ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు 'కల్యాణపర్వ' ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్తున్నారు. జహీరాబాద్‌కు 90 కిలో మీటర్ల దూరంలో బసవకల్యాణ్ ఉంది. ఎత్తైన గుట్టపైన, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్యలో 21 ఎకరాల స్థలంలో 108 అడుగుల భారీ విగ్రహాన్ని 2014లో నిర్మించారు. ఆ ప్రాంతానికి 'శరణుశైల'గా నామకరణం చేసి ఏడాదికోసారి కల్యాణ పర్వాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ గుహలు, సొరంగం, బసవేశ్వరుడి బోధనల చిత్రాలు ఉన్నాయి. జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ ప్రధాన కూడళ్ల వద్ద బసవేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామాలలో బృందాలుగా ఏర్పడి ప్రత్యేక వాహనాలు సమకూర్చుకొని బయలుదేరారు.

భోజన, వసతి ఏర్పాట్లు చేశాం:


–శంకర్ పాటిల్, రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు

బసవకల్యాణ్ పట్టణంలో మూడు రోజుల పాటు జరుగు కల్యాణపర్వానికి మన ప్రాంతం నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో రానున్నందున తగిన వసతి ఏర్పాట్లు పూర్తిచేశాం. భోజన, వసతి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి కల్యాణపర్వం కార్యక్రమం గురించి భక్తులకు తెలియజేశాం. జహీరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై ఉన్నందున రాకపోకలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి దుర్మరణం


సుకూరి భాగయ్య

దుబ్బాక: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన దుబ్బాక శివారులోని పెద్దచీకోడ్ మార్గంలో బుధవారం చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రైతు సుకూరి భాగయ్య(50), భార్య ఎల్లవ్వతో కలిసి దుబ్బాక మండలంలోని పెద్ద చీకోడ్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చారు. సాయంత్రం భార్యతో కలిసి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పోతారానికి చెందిన గడీల శ్రీనివాస్‌రెడ్డి దుబ్బాకలో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. పెద్దచీకోడ్ వెళ్లే దారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో సుకూరి భాగయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు, శ్రీనివాస్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఫిర్యాదు అందలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

హైదరాబాద్: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. హైదరాబాద్ మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి టెలీకాలర్‌గా పనిచేస్తూ.. మధురానగర్‌లోని యెగితా లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గతంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12 నుంచి ఈనెల 9 వరకు దఫదఫాలుగా రూ.3.5 లక్షలు చెల్లించింది. మరిన్ని డబ్బులకు వేధిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య తిరిగి రాలేదని మేస్త్రీ ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: దసరా పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు చిన్నపాటి మనస్పర్థలతో కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా మిగిలాడు. మద్యం తాగిన మత్తులో భార్యాపిల్లలు గుర్తుకు వచ్చి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. వికారాబాద్ ఎస్‌ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకాకు చెందిన ఉప్పరి శ్రీకాంత్ (37), రేణుక దంపతులకు సంజన, స్వాతి, బస్వరాజ్, రితీష్‌లు సంతానం. బతుకుతెరువు కోసం ఏడాది కిందట భార్యాపిల్లలతో వచ్చి సిద్దులూర్ శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో ఉంటున్నారు. మేస్త్రి పనిచేసే శ్రీకాంత్ తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. దసరా పండుగకు అందరూ కలిసి సంతోషంగా సొంత గ్రామానికి వెళ్లారు. పండుగ అనంతరం భర్తతో సిద్దులూర్‌కు తిరిగి రావడానికి భార్య అంగీకరించలేదు. తీరు మార్చుకుంటేనే పుట్టింటికి వస్తానని వాదనకు దిగింది. అయినా లెక్క చేయకుండా భార్యాపిల్లలను అక్కడే వదిలేసి వచ్చాడు. ఒంటరితనం భరించలేక మద్యం మత్తులో వ్యవసాయక్షేత్రంలోని గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండుగకు తల్లిగారింటికి పంపలేదని వివాహిత బలవన్మరణం


సౌమ్య

చేర్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పంపలేదన్న కారణంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చేర్యాల మండలం ఆకునూరులో జరిగింది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాలు.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి చెందిన ముక్కెల మంజుల-రాంరెడ్డిల కుమార్తె సౌమ్య(22)ను నాలుగేళ్ల క్రితం ఆకునూరుకు చెందిన పెంటపర్తి శ్రావణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పండుగకు సౌమ్యను ఆమె భర్త పుట్టింటికి పంపలేదు. మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు ఆమెను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి మంజుల ఫిర్యాదు చేశారు.


రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం వడియారం శివారులో బుధవారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. వడియారం-మాసాయిపేట రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇతనికి సంబంధించినవారు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో రైతు..

తొగుట, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తొగుట మండలం కాన్గల్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. తొగుట ఎస్సై రావికాంతరావు కథనం ప్రకారం.. ముడికే యాదయ్య(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని ముచ్చర్ల నర్సయ్యకు చెందిన వ్యవసాయ భూమివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

కాపాడండీ..


జగదేవపూర్ మండలం తీగుల్ పరిధిలోని పురాతన ప్రార్థన మందిరం

అయ్యలారా.. అమ్మలారా.. మేము చారిత్రక ఆధారాలం. శతాబ్దాల కాలంలో అప్పటి రాజులు తమ అవసరాల కోసం పటిష్ఠంగా నిర్మించారు. ఇప్పటి వరకూ చెక్కుచెదరకుండా ఉన్నాం. ప్రస్తుతం మామీద మొక్కలు, తీగలు పెరిగి, వేళ్లూనుకుంటూ మా పటిష్టతకు భంగం కలిగిస్తున్నాయి. ప్రజలారా.. మీరు ప్రజాప్రతినిధుల ద్వారానో, అధికారుల ద్వారానో, స్వచ్ఛందంగా సేవలు అందించే యువజన సంఘాలతోనో మమ్ములను మీ భవిష్యత్తు కోసం కాపాడండి. పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా.. మొక్కలు పెరగకుండా శుభ్రం చేస్తే మీ ఊరికి మేము గుర్తింపు కలిగిస్తామని మరువొద్దు. చరిత్ర సాక్ష్యాలు లేకుంటే భవిష్యత్తు ప్రణాళికలు సక్రమంగా వేయడం కుదరదని గమనించండి. శిథిలం కాకముందే సరి చేయండి.

ఇట్లు మీ ...

సంగారెడ్డి జిల్లా అందోలులో గైని (గడీల ద్వారం), రెడ్డి రాజుల కాలం
సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్‌లో రెండో నిజాం నవాబు నిర్మించిన ప్రార్థన మందిరం

– న్యూస్‌టుడే, జోగిపేట టౌన్, జగదేవపూర్


అందోలులో గడీ ప్రధాన ద్వారంపై చెట్లు

బోధన వృత్తికి పట్టం.. అక్కన్నపేట విశేషం

- అక్కన్నపేటలో జనాభా 4,545
- 2012 డీఎస్సీలో గ్రామం నుంచి అత్యధికంగా 14 మంది అర్హులు కావడం విశేషం
- గ్రామంలో 1960 నుంచి ప్రభుత్వ ఉద్యోగులు 140
- ప్రస్తుతం ఉపాధ్యాయులు 50 మంది ఉన్నారు.
- ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా ఉన్నారు.

రామాయంపేట, న్యూస్‌టుడే: ఎవరో ఒకరు. . ఎపుడో అపుడు.. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా ఆ ఊరిలో అందరూ ఉద్యోగాల బాటలో పయనిస్తున్నారు. ఒకరు ఒక ఇద్దరు కాదు.. ఏకంగా 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో 1,010 కుటుంబాలు ఉన్నాయి. ఊరిలో అన్ని వర్గాల వారు ఉన్నారు. అధికంగా ప్రభుత్వ ఉద్యోగాల వైపు అందులోనూ ఉపాధ్యాయులుగా స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలు నిదర్శనం.

ప్రతి డీఎస్సీలోను చోటు

సాధారణంగా గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే అందులో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే ఊరందరికీ తెలిసిపోతుంది. అక్కన్నపేట గ్రామంలో మాత్రం అవి సర్వసాధారణమే. ప్రతి డీఎస్సీలోను ఒకరికి మించి సాధిస్తుండటం విశేషం. ఇలా ఇప్పటివరకు 50 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్జీటీలో ఇద్దరు.. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ జిలాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.

స్వయంపాలన దినోత్సవ స్ఫూర్తి

పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా వ్యవహరించడం స్ఫూర్తి నింపింది. ఆ ఒక్క రోజే కాకుండా ఉపాధ్యాయులుగా ఎదగాలన్న ఆకాంక్ష కలిగిందంటారు.. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచందర్. 1982లో ఉపాధ్యాయుడిగా అర్హత సాధించిన ఆయన స్ఫూర్తితో గ్రామంలో ఇప్పటివరకు 50 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు.

నిపుణులను తయారు చేసేది బోధన వృత్తి



ఉపాధ్యాయ వృత్తి స్వచ్ఛమైనది. సమాజంలోని అన్ని రంగాల్లోనూ నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులే. భవిష్యత్తు తరాన్ని సవ్యదిశలో నడిపించేది ఈ వృత్తే. గ్రామంలో బోధననే ఎంచుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా.
రామచందర్, విశ్రాంత ఉపాధ్యాయుడు

గిరిపుత్రుడు.. గెలుపు కెరటం

- జమ్మూకశ్మీర్‌లో ఎఫ్‌సీఐ జీఎంగా ప్రస్థానం


సేంద్రియ ఎరువుతో పూల సాగు

న్యూస్‌టుడే, నర్సాపూర్: వారిది నిరుపేద గిరిజన కుటుంబం.. వ్యవసాయం చేస్తేనే పూట గడిచే రోజులవి. పరిస్థితులకు తలవంచలేదు. ఏదో సాధించాలనే తపన... లక్ష్యం చేరుకోవాలనే పట్టుదల... ఎన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధించే వరకు విశ్రమించలేదు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన ఛత్రునాయక్ ఉన్నతంగా ఎదిగారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లోని భారత ఆహార సంస్థలో (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు.

మహ్మదాబాద్ తండా నుంచి..

నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన లున్సావత్ మున్నిభాయ్, తుక్యాల మొదటి కుమారుడైన ఛత్రునాయక్‌కు కాలినడకన బడికి వెళ్లి చదువుకోవాలన్నా సరైన దారి లేక చాలా కష్టంగా ఉండేది. నర్సాపూర్‌కు నడుస్తూ వెళ్లి పదో తరగతి చదివారు. హాలియాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూలో పీజీ పూర్తిచేశాక 1989లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో టెక్నికల్ అధికారిగా కేంద్రం ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1977లో ఎఫ్‌సీఐలో సహాయ మేనేజర్‌గా బెంగళూరులో పనిచేశారు. హైదరాబాద్, నల్గొండ, తార్నాక, కరీంనగర్‌లో మేనేజర్‌గా చేశారు. డీజీఎంగా పదోన్నతి లభించడంతో అస్సాం, గవుహాటిల్లో విధులు నిర్వహించారు. జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది ముంబయికి బదిలీ అయ్యారు. మూడు సంవత్సరాల అనంతరం జమ్మూకశ్మీర్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలకు జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట 1.50 లక్షల టన్నుల బియ్యం సరఫరాకు సంబంధించి విధులు చేపడుతున్నారు.

సేంద్రియ సాగుపై మక్కువ

ఆయనకు సెలవు దొరికితే చాలు మహ్మదాబాద్ తండాకు వస్తారు. పొలాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తారు. బీర, కాకర, వంగ, బెండ, మిర్చి, తీగ జాతి కూరగాయలను రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. పెద్దఎత్తున బంతి పూలను సాగు చేస్తున్నారు. తనకు జన్మనిచ్చిన గడ్డకు ఏదోఒకటి చేయాలనే తపన ఆయనది. ప్రస్తుతం తాజామాజీ ఎంపీటీసీ సంధ్యారాణి ఛత్రూనాయక్ భార్య. కుమారుడు యువహీరో అనురాగ్. 15 ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేశారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126-00	డ్రెస్డ్	215-00
రిటైల్	148-00	స్కిన్‌లెస్	244-00

సంక్షేమమే లక్ష్యంగా పాలన: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

గుమ్మడిదల: సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుమ్మడిదల రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. తహసీల్దార్ గంగాభవాని, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.


18న ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

హత్నూర, న్యూస్‌టుడే: హత్నూరలోని గురుకుల పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ప్రవేశానికి ఈనెల 18 ఆరో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు ట్రేడ్‌లలో ఖాళీలుగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు.

అనువుగా లేక..అక్కరకు రాక!

న్యూస్‌టుడే పరిశీలన

న్యూస్‌టుడే, జోగిపేట, పుల్కల్, రేగోడు, జహీరాబాద్ అర్బన్: ప్రయాణికులు సేద తీరేందుకు నిర్మించిన బస్సు ప్రాంగణాలు చాలావరకు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా ఉన్న ఉపయోగంలోకి రాకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జహీరాబాద్, నారాయణఖేడ్ డివిజన్‌లోని మండలాల్లోని ప్రధాన దారుల్లోని గ్రామాలు, కూడళ్లలోని బస్‌షెల్టర్ల ఉన్న చోట వృథా లేనిచోట వ్యథలా మారడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. అందోలు నియోజకవర్గ పరిధిలోని అందోలు, చౌటకూరు, పుల్కల్, వట్‌పల్లి, రాయికోడ్ మండలాల్లో బస్సు ప్రాంగణాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పుల్కల్‌లో ప్రయాణ ప్రాంగణం నిర్మించినా.. అది గ్రామానికి దూరంగా ఉంది. రేగోడునూ ఊరికి దూరంగా ప్రాంగణం నిర్మించడంతో దాని పరిస్థితి అంతే. ఆ గ్రామస్థులంతా ఊరిలోనే బస్సులు ఎక్కుతున్నారు. చౌటకూరు మండల కేంద్రంలో ప్రయాణ ప్రాంగణమే లేదు.



రేగోడులో నిరుపయోగంగా ప్రాంగణం

రోడ్లపైనే బస్సుల కోసం ఎదురు చూపులు

సింగూరు దారిలో కష్టాలు

161 జాతీయ రహదారిపై ఉన్న తాడ్దాన్‌పల్లి గ్రామ శివారు నుంచి సింగూరుకు వెళ్లే 'ఎక్స్ రోడ్డు'లో బస్సు ప్రాంగణం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణికులు చౌరస్తాలోని విభాని వద్దే ఎదురు చూస్తున్నారు. అందోలు, సంగపేట, కన్‌సానిపల్లి గ్రామాల వద్ద ఓ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణం నిర్మించినప్పటికీ పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. మిగతా గ్రామాలైన అన్నాసాగర్, రాంసానిపల్లి, చింతకుంట గ్రామాల్లో ప్రజలు రహదారుల పక్కన ఉన్న చెట్లనే షెల్టర్లుగా వాడుకుంటున్నారు.

ఎండలో నిల్చోవాల్సిందే...

జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, మొగడంపల్లి చౌరస్తాల్లో షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిల్చోక తప్పడంలేదు. అల్గోల్‌లో అనువుగా లేనిచోట నిర్మాణం చేయడంతో నిరుపయోగంగా మారింది. న్యాల్‌కల్ మండలం చాల్కి కూడలిలో దశాబ్దన్నర కాలంగా బస్‌షెల్టర్ అసంపూర్తిగా మిగిలింది. ఝరాసంగం మండలం కప్పాడ్, కుప్పానగర్‌లో బస్సులు నిలిచేది ఓ చోట.. బస్సు షెల్టర్ మరోచోట ఉన్నాయి. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో-13, ఝరాసంగం-4, న్యాల్‌కల్‌లో-5, కోహీర్-5 చొప్పున ఉమ్మడి రాష్ట్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ల నిర్మాణాలు జరిగాయి. అనంతరం నిర్వాహణకు నిధులు కేటాయించక పోవడం, పాలకులు, అధికారుల అశ్రద్ధలతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

కాసాలలో విగ్రహాల ప్రతిష్ఠ



మాట్లాడుతున్న మాధవనంద సరస్వతి స్వామీ

హత్నూర: కాసాలలో బుధవారం దుర్గాభవానీ, ఊరడమ్మ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం కనులపండుగగా సాగింది. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాదవానంద సరస్వతిస్వామి వేడుకల్లో పాల్గొని భక్తులకు ధర్మ సందేశమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

భాజపా సభ్యత్వ నమోదు



సభ్యత్వ పత్రాలు అందజేస్తూ..

జిన్నారం, గుమ్మడిదల: దాదిగూడెంలో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి చెప్పారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నేతలు పాల్గొన్నారు. ● అన్నారంలో భాజపా మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఐలయ్య ఆధ్వర్యంలో పలువురికి సభ్యత్వాలు ఇచ్చినట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా నాయకులు అంజిరెడ్డి, ఉదయ్‌కుమార్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సృజనలక్ష్మి పాల్గొన్నారు.

దారులు అధ్వానం.. ప్రయాణానికి కష్టం



న్యాల్‌కల్ మండలంలోని వడ్డి గ్రామం నుంచి డప్పూర్ మీదుగా బీదర్ వెళ్లే ప్రధాన దారి గుంతలుగా మారింది. ఈ దారిలో కొంతదూరం తారు, మరి కొంత దూరం కంకర వేసి ఉంది. అక్కడక్కడ తారు లేవడంతో గుంతలు ఏర్పడగా, కంకర అస్తవ్యస్తంగా మారిది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మరమ్మతులు చేయించాలని వడ్డి గ్రామానికి చెందిన ఈశ్వర్‌తోపాటు పలువురు పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, జహీరాబాద్.

ఏళ్లుగా... మరమ్మతులు మరిచారు



కొండాపూర్ మండలం మారేపల్లి నుంచి సిద్ధాపూర్ మీదుగా సదాశివపేటకు వెళ్లే ప్రధాన దారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారింది. నిత్యం ఇక్కడి నుంచి వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుపై ప్రమాదకరంగా గోతి ఏర్పడటంతో స్థానికులు తాత్కాలికంగా చెట్ల కొమ్మలు ఏర్పాటు చేశారు. తరచుగా దారిపై నీరు నిలబడి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, కొండాపూర్.

మళ్లీ 'ఓటరు'గా నమోదు చేసుకోవాలి



సమీక్షలో జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్

జహీరాబాద్ అర్బన్: శాసన మండలి ఎన్నికల సందర్భంగా పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓటు వేసినప్పటికీ మళ్లీ నవంబరు 6వ తేదీలోగా ఆన్‌లైన్ లేదా స్వయంగా నమోదు చేసుకోవాలన్నారు.

ఒకరి అదృశ్యం

ఝరాసంగం: కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగాలేని చిలేమామిడి గ్రామానికి చెందిన గొల్ల రాములు(38) ఈనెల 3వ తేదీ నుంచి కనిపించడంలేదు. ఆయన భార్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జిన్నారం, గుమ్మడిదల: జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు తెలిపారు. జిన్నారం, గడ్డపోతారం ఎస్ఎస్1, ఎస్ఎస్2, సోలక్‌పల్లి, శివనగర్ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో సరఫరా ఉండదని వినియోగ దారులు సహకరించాలని కోరారు. ● గుమ్మడిదల 133//32 కేవీఏ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవులు పెడితే బోధన సాగేదెలా?

ఝరాసంగం: ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో సుధాకర్ సూచించారు. బుధవారం మండలంలోని బర్దిపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయులు తరచుగా సెలవులు పెడితే బోధన సాగేదెలా అంటూ మండిపడ్డారు.

జిల్లా మహా సభల జయప్రదానికి పిలుపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా మహా సభలు ఈనెల 19, 20 తేదీల్లో జహీరాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు బుధవారం పిలుపునిచ్చారు. ఈమేరకు రూపొందించిన లోగోను స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజయ్య, మాణిక్యం, సాయిలు తదిరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

నారాయణఖేడ్: పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యనికి హాని కలుగుతుందని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం పర్యవేక్షకులు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖేడ్ మండలం చాప్టా(కె) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధాన కూడళ్లల్లో యువకులకు జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు.

స్థలం కేటాయించాలని వినతి

సదాశివపేట, న్యూస్‌టుడే: సదాశివపేట పట్టణ పరిధిలో అచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం పురపాలక సంఘం ఉపాధ్యాక్షుడు చింతా గోపాల్ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. బైపాస్ రహదారిలో అవసరమైన స్థలం అందుబాటులో ఉందన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శివరాజ్‌పాటిల్, చింతా రాజు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ముఖ్యం

సదాశివపేట, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శంగా నిర్వహించాలని కోరుతూ బుధవారం భారాస నాయకులు ఎంపీడీవో లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారాస మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానిక నాయకులు రత్నాకర్‌రెడ్డి, సుధాకర్, అశోక్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతికి అన్నిరకాల చర్యలు

జిన్నారం: ఐడీఏ బొల్లారం పట్టణ ప్రగతికి చర్యలు తీసుకుంటున్నామని పుర అధ్యక్షురాలు రోజారాణి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 4, 20 వార్డుల్లో ఆమె కమిషనర్ మంగతాయారుతో కలిసి సీసీ రోడ్డు, భూగర్భ కాలువ పనులు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. కౌన్సిలర్లు నిహారికారెడ్డి, జయమ్మ, కార్మిక నేత వరప్రసాద్‌రెడ్డి, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు వినతి

సంగారెడ్డి టౌన్: గొల్లగూడెం, సదాశివపేట బైపాస్ కూడలి వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సదాశివపేటకు చెందిన శివరాజ్ పాటిల్, చింతా గోపాల్, ఆనంద్ బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

బకాయిలు విడుదల చేయాలని ధర్నా



సంగారెడ్డి టౌన్, నారాయణఖేడ్, నారాయణఖేడ్ రూరల్, జహీరాబాద్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, బోధనా రుసుం బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ బకాయిల కారణంగా ప్రైవేటు కళాశాలలు సమ్మె నిర్వహించే పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, అనిల్, సిద్దేశ్వర్, సాత్విక తదితరులు పాల్గొన్నారు. ● బంద్‌తో విద్యార్థుల చదువులకు నష్టం కలుగుతుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అశోక్ ఖేడ్‌లో నిర్వహించిన ఆ సంఘ డివిజన్‌స్థాయి సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలల బంద్ పాటిస్తున్నాయన్నారు. ఆ సంఘ నాయకులు నిఖిల్, రోహిత్, సవన్, కారంతి, నితిన్, రహీం పాల్గొన్నారు. ● బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఖేడ్ ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల సిబ్బంది విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ● రుసుములు విడుదల చేయాలని కోరుతూ జహీరాబాద్‌లో పలు డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొనసాగింది. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.

విగ్రహ ధ్వంసంపై నిరసన!



సదాశివపేట: సదాశివపేట పట్టణంలో ఓ విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు భక్తులు బుధవారం పోలీసులు ఫిర్యాదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ నాయకులు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీనిపై సీఐ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను తర్వలో పట్టుకుంటామని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు ఆలయాన్ని పరిశీలించారు. భాజపా నాయకులు ఎస్పీ రూపేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

వృద్ధురాలికి వందో జన్మదిన వేడుక



జిన్నారం: వికారాబాద్‌కు చెందిన వృద్ధురాలు శాంతా బాయి వందేళ్లు పూర్తిచేసుకున్నారు. ఇటీవల జిన్నారంలో ఉంటున్న ఆమె కూతురు ఇంటికి వచ్చారు. అక్కడే కుటుంబ సభ్యులు బుధవారం ఆమె 100వ జన్మదిన వేడుక నిర్వహించారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుమారు 70 మందికిపైగా ఆమె కుటుంబ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో పాటు పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

'సామాజిక సేవ' అభినందనీయం



మొక్క నాటుతున్న డీసీసీబీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం తదితరులు

సంగారెడ్డి అర్బన్: విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని డీసీసీబీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం పేర్కొన్నారు. బుధవారం ఫసల్‌వాది లోని వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 22 వరకు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నటు తెలిపారు. కళాశాల డీన్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారులు రవితేజ పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

వికారాబాద్: నిర్మాణంలోని భవనం నుంచి పడి కూలీ మృతిచెందిన సంఘటన వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలో బుధవారం జరిగింది. పటాన్‌చెరుకు చెందిన వడ్డె అశోక్(35) బతుకుతెరువుకు వికారాబాద్‌లోని శివరామ్‌నగర్ కాలనీలో భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో అద్దెఇంట్లో ఉంటున్నారు. ఎన్నెపల్లిలో ఓ భవనంలో పనులు చేస్తూ.. కాలు జారి పడి మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణరాజు తెలిపారు.


కాల్వల్లో చెత్త వేయవద్దు

నారాయణఖేడ్: కాల్వల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దని ఖేడ్ పురపాలిక కౌన్సిలర్ అభిషేక్‌షెట్కార్ కోరారు. మంగల్‌పేటలోని కాల్వలో మురుగు ముందుకు పారని తీరును పరిశీలించి శుభ్రం చేయించి ఆయన మాట్లాడారు.

ట్రాన్స్‌కో ఏఈగా వెంకటేశ్వర్లు

జిన్నారం: గద్వాల నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు బుధవారం జిన్నారం ఏఈగా బాధ్యతలు స్వీకరించారు.

హరీశ్‌రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే



నారాయణఖేడ్: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్ మండల భారాస అధ్యక్షుడు కుమ్మరి పరమేష్‌తో కలిసి బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ ప్రాంతంలోని పలు విషయాలపై చర్చించారు.


చెరకు రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

సంగారెడ్డి అర్బన్, కోహీర్, న్యాల్‌కల్, న్యూస్‌టుడే: చెరకు టన్నుకు రూ.4500 మద్దతు ధర ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్(బాకీసం) నాయకులు సీడీసీ ఛైర్మన్ రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. బుధవారం సంగారెడ్డిలోని సీడీసీ కార్యాలయంలో ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడారు. బాకీసం జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, వీరప్ప పాల్గొన్నారు. ● మనియార్‌పల్లిలో 'వసంత్ దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్త మానే ఆధ్వర్యంలో బుధవారం చెరకు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ కంపెనీ ఛైర్మన్ సచిన్ గోయల్, రూపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ● మామిడ్గిలో 'గోదావరి గంగా ఆగ్రో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' సిబ్బంది రైతులకు దిగుబడి సాధనకు చేయాల్సిన కృషిని వివరించారు. నవంబర్ 8న చక్కర పరిశ్రమ ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో కేన్ జీఎం రవీందర్‌రెడ్డి, క్షేత్ర సహాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేర్వేరు జల వనరుల్లో రెండు మృతదేహాలు!



శ్రీనివాస్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మొగుడంపల్లి మండలం రాయిపల్లితండా శివారులోని నీటి కుంటలో బుధవారం ఖాన్‌జమాల్‌పూర్‌కు చెందిన బంటు శ్రీనివాస్(39) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడా? లేక ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సదాశివపేట: కొత్తచెరువులో బుధవారం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో వల చుట్టుకుని మరణించి ఉండవచ్చన్నారు. శరీరంపై నలుపు రంగు ప్యాంటు, తెలుపు, నలుపు, ఆకుపచ్చ రంగుల చెక్స్ ఉన్న చొక్కా ఉందన్నారు. పూర్తి వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పన్నులు వస్తున్నా.. పనులు సున్నా

అభివృద్ధికి ఆమడ దూరంలో ఓడీఎఫ్ కాలనీ



కాలువల్లేక రోడ్డుపై పారుతున్న మురుగు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: పదేళ్ల కిందట ఉద్యోగులతో ఏర్పడిన ఓడీఎఫ్ కాలనీలో ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. మొదటి నుంచి ఈ కాలనీపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. కాలనీ విస్తరించిన పెద్దపెద్ద భవనాల వల్ల రూ.లక్షల్లో పురపాలక సంఘానికి ఆస్తి పన్నులు వస్తున్నా.. వాటిని స్థానికంగా ఖర్చు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. చిన్నపాటి వర్షపడినా రోడ్లపై వరద నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. తదుపరి పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలువలు సరిగా లేకపోవడంతో ఇళ్ల ముందు మురుగు చేరి దుర్గంధం వ్యాపిస్తుంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.